సాక్షి నిర్మల్

శనివారం : 10 : మే : 2025



జీవన రేఖ.. వివక్షకు ప్రతీక

నిర్మల్ జిల్లాకు బాసర–లక్సెట్టిపేట రహదారి జీవన రేఖగా ఉంది. తూర్పు, పశ్చిమ జిల్లాలను కలుపుతూ 175 కిలో మీటర్ల మేర ఈ రహదారి వ్యాపించి ఉంది. 10లో▸



కొలువుల భర్తీపై ఆశలు

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను పూర్తి చేసి, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ల జారీకి సిద్ధమవుతోంది. నిరుద్యోగ యువతలో ఆశలు చిగురిస్తున్నాయి. 11లో▸

గరిష్ఠం/కనిష్ఠం
37.6 /28.4

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వేడి, ఉక్కపోత కూడా తక్కువగా ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మందులు అందుబాటులో ఉంచాలి



జిల్లా డ్రగ్ స్టోర్ ను పరిశీలిస్తున్న అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా డ్రగ్ స్టోర్‌లో రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ గోపాల్ సింగ్ సిబ్బందికి సూచించారు. జిల్లా కేంద్రంలోని డ్రగ్ స్టోర్‌ను శుక్రవారం పరిశీలించారు. అవసరమైన మందులను ఉమ్మడి జిల్లా మెయిన్ డ్రగ్ స్టోర్ నుంచి లేదా రాష్ట్రం నుంచి ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలని సూచించారు. వారివెంట నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డాక్టర్ సునీల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలీసెట్‌కు ఏర్పాట్లు

నిర్మల్‌ఖిల్లా: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్– 2025కు జిల్లాలో ఏర్పాట్లు చేసినట్లు జిల్లా సమన్వయకర్త, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రమేశ్ తెలిపారు. ఈనెల 13న జిల్లా కేంద్రంలోని 8 పరీక్ష కేంద్రాల్లో 2,422 మంది పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, సోఫీ నగర్ గురుకుల కళాశాల, వశిష్ఠ డిగ్రీ కాలేజ్, వశిష్ఠ జూనియర్ కాలేజ్, దీక్ష డిగ్రీ కాలేజీలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్ తోపాటు హెచ్‌బీ పెన్సిల్, బాల్‌పాయింట్ పెన్‌తో సకాలంలో హాజరు కావాలని సూచించారు. ఉదయం 11 నుంచి 1:30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని పేర్కొన్నారు.

నిద్రకు దూరం..!



- అర్ధరాత్రి దాటినా ఫోన్‌లో ఆటలు
- ఫేస్‌బుక్, వాట్సాప్ టెక్నాలజీ ప్రభావం
- రోజుకు 8 గంటల నిద్ర ఆరోగ్యమంటున్న వైద్యులు

నిర్మల్‌చైన్‌గేట్: ఇంటర్నెట్, సోషల్ మీడియా, స్మార్ట్ ఫోన్‌లు, టెలివిజన్ వంటి సాంకేతిక సాధనాలు జిల్లా ప్రజల జీవనశైలిని మార్చేస్తున్నాయి. రాత్రి 9 గంటలకే నిద్రించే వారు ఇప్పుడు అర్ధరాత్రి దాటినా ఫోన్‌లతో కాలం గడుపుతున్నారు. మారిన జీవనశైలి, ఆహార అలవాట్ల కారణంగా జిల్లాలో 1,00,052 మంది కంటిచూపు సమస్యలతో, 30% మంది నిద్రలేమితో బాధపడుతున్నట్లు ఇటీవలి వైద్య నివేదికలు వెల్లడించాయి. ఈ సమస్యలు మానసిక ఆందోళన, ఏకాగ్రత లోపం, మధుమేహం, రక్తపోటు వంటి ఆరోగ్య సమస్యలతో పాటు, యువత దాంపత్య జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు పేర్కొంటున్నారు.

ఆధునిక జీవనశైలి..

గతంలో రాత్రి 8 గంటలకే నిద్రపోయే గ్రామీణ, పట్టణ ప్రజలు ఇప్పుడు పని ఒత్తిడి, మానసిక ఆందోళనలతో అర్ధరాత్రి దాటినా నిద్రపోవడం లేదు. యువత పార్టీలు, బార్‌లలో రాత్రి వేళల్లో మద్యం, జంక్ ఫుడ్‌ను ఎక్కువగా తీసుకుంటున్నారు. జీర్ణం కాకముందే నిద్రించడం వల్ల శ్వాసనాళాలపై ఒత్తిడి పెరిగి, గురక, నిద్రలేమి సమస్యలు తలెత్తుతున్నాయి. కొందరు స్లీపింగ్ టాబ్లెట్స్, మత్తు పదార్థాలపై ఆధారపడుతూ ఒక సమస్య నుంచి మరో సమస్యలో చిక్కుకుంటున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిద్ర సమయం ఇలా..

వైద్యుల సిఫార్సు ప్రకారం, రోజుల వయసు శిశువులకు 18 గంటలు, ఏడాది లోపు చిన్నారులకు 14–18 గంటలు, 1–3 ఏళ్ల వారికి 12–15 గంటలు, 3–5 ఏళ్ల వారికి 11–13 గంటలు, 5–12 ఏళ్ల వారికి 9–11 గంటలు, 12–19 ఏళ్ల వారికి 9–10 గంటలు, 21 ఏళ్ల పైబడిన వారికి 7–8 గంటలు, 50 ఏళ్ల పైబడిన వారికి 5–7 గంటల నిద్ర అవసరం. ఈ సమయాన్ని పాటించడం ఆరోగ్యానికి కీలకం.

సాంకేతికత, మారిన జీవనశైలి వల్ల నిద్రలేమి, కంటిసమస్యలు పెరుగుతున్నాయి. యువత, పిల్లలు స్క్రీన్ టైమ్‌ను తగ్గించి, ఆరోగ్యకరమైన ఆహారం, నిద్ర అలవాట్లను అలవర్చుకోవాలి. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు అవగాహన కల్పించి, ఆరోగ్యవంతమైన జీవనశైలిని ప్రోత్సహించాలి. ఈ సమస్యలను అధిగమించడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

కంటిచూపుపై సెల్‌ఫోన్ ప్రభావం..

పిల్లలకు భోజనం తినిపించేందుకు తల్లిదండ్రులు రెండేళ్ల వయసు నుంచే సెల్‌ఫోన్ ఇస్తున్నారు. విద్యార్థులు హోంవర్క్, ప్రాజెక్టుల కోసం ఇంటర్నెట్‌పై ఆధారపడుతూ గంటల తరబడి స్క్రీన్‌లను చూస్తున్నారు. దీనివల్ల కళ్లలో నీరు కారడం, దురద, చూపు మందగించడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని కంటి వైద్యులు తెలిపారు. పిల్లల స్క్రీన్ టైమ్‌ను తగ్గించాలని, తల్లిదండ్రులు సొంత ఆలోచనలకు ప్రాధాన్యమిచ్చేలా ప్రోత్సహించాలని సూచిస్తున్నారు.

జిల్లాలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి పరీక్షలు..

పరీక్షలు నిర్వహించిన మొత్తం విద్యార్థులు 46,453
బాలురు 21,807, బాలికలు 24,646
దృష్టి లోపం గుర్తించిన విద్యార్థులు 1,578
బాలురు 853, బాలికలు 725
6 నుంచి 14 ఏళ్లలోపు దూరపు చూపు తక్కువ ఉన్నవారు 1,735
6 నుంచి 14 ఏళ్లలోపు కంటి సమస్యలతో బాధపడుతున్నవారు 25
15 నుంచి 40 ఏళ్లలోపు దూరపు చూపు తక్కువ ఉన్నవారు 49,512
40 ఏళ్లు పైబడి దగ్గర చూపు తక్కువ ఉన్నవారు 48,811
కంటి మోతి బిందు ఉన్నవారు 7,523
మోతి బిందు ఆపరేషన్ చేయించుకున్న వారు6,242

8 గంటల నిద్ర తప్పనిసరి..



ప్రతీ పది మందిలో ముగ్గురు నిద్రలేమితో బాధ పడుతున్నారు. వ్యక్తికి కనీసం 8 గంటల నిద్ర తప్పనిసరి. ఆరు, అంతకన్నా తక్కువ గంటలు నిద్రపోతే ఏకాగ్రత లోపిస్తుంది. జ్ఞాపకశక్తి సమస్యలు వస్తాయి. నాలుగైదు గంటలు మాత్రమే నిద్రపోయే వారిలో కేన్సర్‌తో పోరాడే శక్తి 70 శాతం తక్కువ ఉంటుంది. నిద్రలేమితో మానసిక, శారీరక ఎదుగుదలకు సంబంధించిన హార్మోన్స్ తగ్గుతాయి. సెక్స్‌వల్ హార్మోన్స్ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతుంది.

– డాక్టర్ సురేశ్, సీనియర్ కంటి వైద్యనిపుణుడు

సుఖ నిద్ర కోసం జాగ్రత్తలు..



నిద్రపోయే ముందు మొబైల్ ఫోన్లు, ఇతరత్రా డిజిటల్ స్క్రీన్‌లు చూడొద్దు. అవి నిద్రపై తీవ్ర ప్రభావం చూపుతాయి. కాఫీ తాగితే బాగా నిద్ర పడుతుందని చాలా మంది భావిస్తుంటారు. కానీ అది తప్పు. మెదడు చుట్టూ ప్రవహించే కెఫిన్ గాఢనిద్రను దూరం చేస్తుంది. మద్యం సహజసిద్ధమైన నిద్రను దూరం చేస్తుంది. గాఢ నిద్రను అడ్డుకుంటుంది. రాత్రి 7 గంటల లోపే డిన్నర్ పూర్తి చేయాలి. వ్యాయామం, యోగాసనాలు సుఖనిద్రకు దోహదపడతాయి.

– డాక్టర్ రత్నాకర్, ఫిజీషియన్

కంటి పరీక్షలు చేస్తాం..



చిన్న వయసులో కంటి సమస్యలు గుర్తించాలి. సమస్యలు ఉండే విద్యార్థులు చదువుతోపాటు, ఇతర ఏ అంశంపై ఏకాగ్రత పెట్టలేరు. చిన్న వయసులోనే కంటి సమస్యలను గుర్తించి, చికిత్స అందిస్తే వారికి మేలు జరుగుతుంది. ప్రధానంగా పాఠశాల వయస్సులో ఆటలు ఆడించడం వల్ల కంటి సమస్యలను కొంత నివారించవచ్చు.

– డాక్టర్ శ్రీనివాస్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం జిల్లా అధికారి

భూసమస్యల పరిష్కారానికి భూభారతి



మాట్లాడుతున్న ఆర్డీవో కోమల్ రెడ్డి

కుంటాల: భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టం రూపొందించిందని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెంచికల్‌పాడ్, దౌనెల్లి, అందాకూర్‌లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మాట్లాడారు. గ్రామాల్లోని రైతుల సమస్యలు ఉంటే పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో 72 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ కమల్‌సింగ్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు కమల్ సింగ్, ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, లింగమూర్తి, శ్రీకాంత్, డీటీ నరేశ్‌గౌడ్, ఆర్‌ఐలు అడెల్లు, రాజేశ్వర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

20న భారత్ బంద్



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: మే 20న గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఠాకూర్ తిరుపతి తెలిపారు. గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం కరపత్రాలు విడుదల చేశారు. మోదీ సర్కార్ రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, ఉపాధి హామీ కూలీలకు పని దినాలు తగ్గించొద్దని డిమాండ్ చేస్తూ బంద్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్, నాయకులు గడ్డం రాజేశ్ పాల్గొన్నారు.

ఏపీ పోలీసుల తీరుపై జర్నలిస్టుల నిరసన



ర్యాలీగా వెళ్తున్న జర్నలిస్టులు



కలెక్టర్‌కు మెమోరాండం ఇస్తున్న పాత్రికేయులు

- కలెక్టర్‌కు మెమోరాండం

నిర్మల్: నిజాలను నిక్కచ్చిగా, వాస్తవాలను ఉన్నవి ఉన్నట్లుగా ప్రచురిస్తున్న వార్తాపత్రికలపై ప్రభుత్వాలు కక్ష సాధింపు చర్యలు చేపట్టడం సరికాదని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పోలీసులు ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి నివాసంలో సోదాలు జరపడంపై అన్ని జర్నలిస్టు సంఘాలు, నిర్మల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలో నిరసన తెలిపారు. విశ్రాంతి భవనం నుంచి కలెక్టర్ క్యాంప్ కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. కలెక్టర్ అభిలాష అభినవ్‌కు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ.. రాజకీయపరమైన కక్ష సాధింపు చర్యలను జర్నలిస్టులపై చేపట్టడం దారుణమన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన ప్రభుత్వాలే ఇలా పోలీసులతో కక్ష సాధింపు చర్యలకు చేపట్టడం సరికాదని పేర్కొన్నారు. తమ నిరసనను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడేలా చూడాలని కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వంతోపాటు సమాచార పౌరసంబంధాలశాఖ దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ తెలిపారు. నిరసనలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐజేయూ), తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(143), తెలంగాణ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్, మున్నూరు కాపు జర్నలిస్టు యూనియన్, తెలుగు ప్రింట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్, నిర్మల్ ప్రెస్‌క్లబ్, తదితర సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు దొంగల బెడద



కుంటాలలో స్టార్టర్ చోరీకి గురైందని చూపిస్తున్న రైతు ఎల్ల గజ్జరాం



కొత్త బోరుమోటార్ బిగిస్తున్న సిబ్బంది

- స్టార్టర్లు, మోటార్లు ఎత్తుకెళ్తున్నవైనం..
- వరుస ఘటనలతో అన్నదాత ఆందోళన
- పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆగని చోరీలు

కుంటాల: మండల శివారులోని రైతుల పంట పొలాల వద్ద ఉన్న బోరుబావి స్టార్టర్లు, విద్యుత్ మోటార్ల చోరీలు ఆగడం లేదు. వరుస దొంగతనాలు అన్నదాతను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గతేడాది నుంచి ఈ దొంగతనాలు కొనసాగుతున్నప్పటికీ, అధికారులు, పోలీసుల నుంచి చర్యలు లేకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారు. వానాకాలం, యాసంగి సీజన్లలో చివరి నీటి తడుల కోసం రైతులు బోర్లు, బావులపైనే ఆధారపడతారు. దొంగలు ఇదే అదనుగా చోరీలకు పాల్పడుతున్నారు. సునాయాసంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో కొందరు స్థానికులే చోరీలకు పాల్పడుతున్నట్లు సమాచారం.

దొంగతనాలతో ఆర్థిక, భద్రతా సమస్యలు

మండల శివారులో ఏడాదిగా సుమారు 30 రైతులకు చెందిన స్టార్టర్లు చోరీ అయ్యాయి. ఒక్కో స్టార్టర్ ధర రూ.2 వేల వరకు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. దొంగలు అర్ధరాత్రి సమయంలో విద్యుత్ తీగలను కత్తిరించి స్టార్టర్లను ఎత్తుకెళ్తున్నారు. ఈ ప్రక్రియలో కత్తిరించిన తీగలకు విద్యుత్ సరఫరా కొనసాగడంతో రైతులు, పశువులకు ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల ఒకే రోజు ఐదు స్టార్టర్లు చోరీ అయ్యాయి. పంచాయతీ నర్సరీకి చెందిన సింగిల్ ఫేజ్ మోటార్, ఆరు స్టార్టర్ల దొంగతనంతో రూ.25 వేల నష్టం వాటిల్లిందని పంచాయతీ కార్యదర్శి రాజబాపు తెలిపారు.

కఠిన చర్యలకు రైతుల డిమాండ్..

రైతులు వ్యయప్రయాసలకు ఓర్చి పంటలు సాగు చేస్తుండగా, ఈ దొంగతనాలు ఆర్థిక భారంగా మారుతున్నాయి. రాత్రిపూట పొలాల వద్ద లేని సమయాన్ని దొంగలు ఉపయోగించుకుంటున్నారు. బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించడం లేదు. అధికారులు తక్షణం స్పందించి దొంగలను పట్టుకొని, న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

పొట్టపెల్లిలో మూడు విద్యుత్ మోటార్ల చోరీ



పొట్టపెల్లి వద్ద మోటార్లు ఎత్తుకెళ్లడంతో ఖాళీగా ఉన్న పైపులైన్

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు మూడు విద్యుత్ మోటార్లు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన రైతులు చింపోలి సాయన్న, పోతుగంటి శ్రీధర్, పీచర గ్రామానికి చెందిన బెడద నరేశ్ పొట్టపెల్లి గ్రామ సమీపంలోని డీ–16 కాలువ వద్ద విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి నీటిని పంటలకు మళ్లిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ముగ్గురు రైతులకు చెందిన మోటార్లను, విద్యుత్ కేబుల్‌తో సహా ఎత్తుకెళ్లారు. శుక్రవారం పొలాల వద్దకు వెళ్లిన రైతులు గమనించి బాధిత రైతులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు వెళ్లిన రైతులు మోటార్లను చూసి ఆవేదన చెందారు. మళ్లీ కొనుగోలు చేయాలంటే రూ.25 వేలు అవుతుందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఎస్సై సుప్రియ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదనపు భారం..



ఆరుగాలం శ్రమించి పంటలను సాగు చేస్తున్నాం. పంట చేతికొచ్చే దశలోనే దొంగలు స్టార్టర్లు ఎత్తుకెళ్తున్నారు. తిరిగి బిగించాలంటే అదనపు భారం పడుతుంది.

– కొత్తకాపు పండరి, రైతు, కుంటాల

ఆరుసార్లు స్టార్టర్ల చోరీ...



నర్సరీలో ఉన్న మొక్కలకు నీరందించేందుకు బోరు మోటార్ బిగించాం. ఆరుసార్లు స్టార్టర్లను ,ఒక మోటారును దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో పంచాయతీకి నష్టం వాటిల్లింది.

– రాజబాపు, పంచాయతీ కార్యదర్శి, కుంటాల

త్వరలో పట్టుకుంటాం..

స్టార్టర్లు చోరీకి గురయ్యాయని రైతులు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నాం. అనుమానితులపై నిఘా పెట్టాం. త్వరలో దొంగలను పట్టుకుని రైతులకు న్యాయం చేస్తాం.

– అశోక్, ఎస్సై, కుంటాల

‘పర్యాటకం’పై కదలిక..!

- బంగల్‌చెరువు, మొసళ్లపార్కుపై అభివృద్ధి కోసం..
- టూరిజం మంత్రి, చైర్మన్ దృష్టికి..
- వినతిపత్రాలు ఇచ్చిన గ్రంథాలయ చైర్మన్
- సంబంధిత అధికారులతో కలెక్టర్ భేటీ
- అవశ్యకతపై 'సాక్షి' వరుస కథనాలు



పర్యాటకంపై సాక్షి ప్రచురించిన కొన్ని కథనాలు



మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వివరిస్తున్న గ్రంథాలయ చైర్మన్ అర్జుమంద్‌అలీ

నిర్మల్: ప్రశ్నార్థకంగా మారిన జిల్లా పర్యాటక అభివృద్ధిపై 'సాక్షి' వరుస కథనాలతో కొంత కదలిక కనిపిస్తోంది. జిల్లా కేంద్రంలోని బంగల్‌చెరువు(వినా యకసాగర్), సోన్ మండలంలోని మొసళ్ల మడుగును టూరిజం స్పాట్‌లుగా అభివృద్ధి చేయాలన్న డిమాండ్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. గతనెలలో కార్పొరేషన్ చైర్మన్ స్వయంగా ఈ రెండు ప్రాంతాలను పరిశీలించి వెళ్లారు. తాజాగా ఈ ప్రాంతాల పరిస్థితి, అభివృద్ధి పనులు, సంబంధిత భూముల విషయంపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ అభిలాష అభినవ్ సమావేశం కావడం పర్యాటక అభివృద్ధిపై ఆశలు బలపరుస్తున్నాయి.

మంత్రిని కలిసిన గ్రంథాలయ చైర్మన్..

జిల్లాలో పర్యాటకాభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు ఉన్నా.. కనీసం పట్టించుకునేవారు లేరన్న వాదన ఎప్పటి నుంచో ఉంది. ఇదే విషయంపై తరచూ 'సాక్షి' కథనాలనూ ప్రచురిస్తోంది. ఈక్రమంలోనే ఇటీవల జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ అర్జుమంద్‌అలీ టూరిజం డెవలప్‌మెంట్ కోసం ప్రయత్నం మొదలు పెట్టారు. గతనెల 20న పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డిని జిల్లాకు రప్పించారు. ఇక్కడి ప్రాంతాలను చూపించారు. మళ్లీ ఈనెల 7న హైదరాబాద్ వెళ్లి చైర్మన్‌ను కలిసి అభివృద్ధి కోసం పనులు చేపట్టాలని గుర్తుచేశారు. అదేరోజు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ద్వారా రాష్ట్ర పర్యాటకాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు లేఖ రాయించారు. తాజాగా శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి జూపల్లిని స్వయంగా కలిసి జిల్లాలో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

అధికారులతో కలెక్టర్ భేటీ..

జిల్లాలో పర్యాటక అభివృద్ధికి జిల్లా అధికారులూ చర్యలు చేపడుతున్నారు. ఈమేరకు కలెక్టర్ అభిలాష అభినవ్ ఎస్పారెస్పీ, అటవీశాఖ, రెవెన్యూ అధికారులతో శుక్రవారం సమావేశమయ్యారు.సోన్ మండలం పాక్‌పట్ల దగ్గర ఉన్న మొసళ్ల మడుగు అభివృద్ధిపై చర్చించారు. అక్కడ ఉన్న భూమి, చేపట్టాల్సిన పనులపై అధికారులతో చర్చించినట్లు తెలిసింది. నిర్మల్ ఉత్సవాల పేరిట మూడురోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించిన కలెక్టర్ అప్పటి నుంచే టూరిజంపైనా దృష్టిపెట్టారు. ఇప్పటికే పలు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు.

పుష్కలంగా అవకాశాలు..

జిల్లాలో పర్యాటక అభివృద్ధి డిమాండ్ దశాబ్ద కాలంగా ఉంది. కానీ.. ఈ దిశగా పూర్తిస్థాయిలో దృష్టి పెట్టే పాలకులు, అధికారులు లేకపోవడం ప్రధాన లోపంగా మారింది. ఇటు సోన్ వంతెన, గోదావరి మొదలుకుని మహబూబ్‌ఘాట్ వరకు, అటు బాసర నుంచి కడెం దాకా ఎన్నో ఉన్నాయి. 'సాక్షి' కొంతకాలంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి అవశ్యకతపై తరచూ కథనాలను ప్రచురిస్తోంది.

ప్రస్తుతానికి ఈ రెండింటిపైనే..

నిర్మల్ కేంద్రంగా టూరిజం సర్క్యూట్ చేస్తామంటూ గత ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నీటిమీద రాతలయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం నుంచి భారీగా నిధులు ఆశించే పరిస్థితి లేదు. ఈనేపథ్యంలోనే ప్రస్తుతానికి జిల్లా కేంద్రంలోని బంగల్‌చెరువు, పాక్‌పట్ల వద్ద మొసళ్ల(క్రోకోడైల్) పార్కును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. ఓవైపు కలెక్టర్, మరోవైపు అధికార పార్టీకి చెందిన గ్రంథాలయసంస్థ చైర్మన్ పర్యాటకాభివృద్ధికి ప్రయత్నిస్తుండటంతో ఈసారి ఎంతోకొంత మార్పు వస్తుందని జిల్లావాసులు ఆశిస్తున్నారు.

పర్యాటకాభివృద్ధికి ప్రయత్నిస్తున్నాం..



జిల్లాలో పర్యాటకంగా చాలాప్రాంతాలు అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇప్పటికే పలు ప్రాంతాలకు సంబంధించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం. పాక్‌పట్ల దగ్గర క్రోకోడైల్ పార్క్ కోసం అటవీశాఖ ద్వారా చేపట్టే ప్రయత్నం చేస్తున్నాం. మిగతా ప్రతిపాదనలకు సంబంధించి టూరిజం శాఖ నుంచి అధికారులు జిల్లాకు రావాల్సి ఉంది.

– అభిలాష అభినవ్, కలెక్టర్

లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మెనేజ్‌మెంట్ నుంచి లైసెన్స్ సర్వేయర్ శిక్షణకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భూముల కొలతల శాఖ సహాయసంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా కేంద్రంలో మే 26 నుంచి జులై 26 వరకు 50 పని దినాలు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఇంటర్‌లో గణితశాస్త్రం ఒక సబ్జెక్టుగా ఉండి కనీసం 60% మార్కులు, ఐటీఐ డ్రాఫ్ట్‌మెన్(సివిల్), డిప్లొమా(సివిల్) బీటెక్(సివిల్), లేక ఏ ఇతర సమానమైన అర్హత కలిగి ఉండాలని తెలిపారు. దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్ మే 5 నుంచి 17 వరకు మీసేవ కేంద్రాల ద్వారా రూ.100 చెల్లించి పొందాలని సూచించారు. దరఖాస్తులు ఈనెల 17లోపు సమర్పించాలని తెలిపారు. మే 17 నాటికి ఓసీ, బీసీ అభ్యర్థులకు 35 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 ఏళ్లు ఉండాలని పేర్కొన్నారు. ఓసీ అభ్యర్థులు రూ.10 వేలు, బీసీ అభ్యర్థులు రూ.5 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.2,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఇతర వివరాలకు 98490 81489, 70326 34404, 94419 47339 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

తమిళనాడుకు తరలిన ఆదివాసీ కళాకారులు



తమిళనాడుకు వెళ్తున్న కళాకారులు

ఇచ్చోడ: జిల్లాకు చెందిన ఆదివాసీ సకలకళా సంక్షేమ బృందం కళాకారులు శుక్రవారం తమిళనాడు రాష్ట్రానికి వెళ్లారు. తంజావూర్‌లో నిర్వహించనున్న 'సెలంగై నా ధం' కార్యక్రమానికి రావాల్సిందిగా ఆదివాసీ కళా సంక్షేమ బృందానికి ఆహ్వానం అందిన ట్లు బృందం డైరెక్టర్ కాత్లె శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో గుస్సాడీ, కొమ్ము, కోయ నృత్యాలు ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. తమిళనాడుకు బయలుదేరిన వారిలో కళాకారులు కాత్లే ఆనంద్, రాము, రాజేంద్రప్రసాద్, లింగు, జలంధర్, దేవురావు, పవన్, సందీప్, లక్ష్మణ్, చరణ్, ఉదయ్, అక్షయ్, భీంరావు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

భీమిని: కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి పంచాయతీ పరిధిలోని వాగు నుంచి శనివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంజాయి నిందితుల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ సమీర్ మహారాష్ట్రలోని కిన్వట్ నుంచి కొద్దిరోజులుగా గంజాయి తెచ్చి విక్రయిస్తున్నాడు. శుక్రవారం మార్కెట్ యార్డు సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గంజాయిని పడేసి పరుగులు తీశాడు. అనుమానించిన పోలీసులు అతడిని పట్టుకుని విచారించారు. అతడి నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. అతడు గంజాయి సేవించినట్లు కూడా నిర్ధారణ కావడంతో అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు వివరించారు. అలాగే, ఆదిలాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన తరాట్ ప్రీతం ఈనెల 1న గంజాయి విక్రయించడంతో పాటు మరో ముగ్గురితో కలిసి సేవించాడు. అతడి నుంచి 5 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

బెదిరింపులకు పాల్పడి నగదు అపహరణ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన అర్బాజ్ పని మీద ఊరికి వెళ్లి తిరిగి రైలు మార్గం ద్వారా గురువారం జిల్లా కేంద్రానికి వచ్చాడు. రాత్రి 12 గంటల సమయంలో పట్టణానికి చెందిన ఖాసిమ్‌తో పాటు మరికొంత మంది ఆయనను బెదిరించారు. అతడి వద్ద ఉన్న రూ.5వేల నగదు లాక్కెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

జీవన రేఖ.. వివక్షకు ప్రతీక

- నది నుంచి అటవీప్రాంతం వరకు..
- విస్తరించిన బాసర-లక్సెట్టిపేట రోడ్డు
- నిర్మల్ జిల్లాలోనే అతిపెద్ద రహదారి
- దారి వెంట ఎన్నో ఆధ్యాత్మిక క్షేత్రాలు
- అబ్బురపరిచే చారిత్రక నిర్మాణాలు
- అయినా అభివృద్ధికి నోచుకోని వైనం



బాసర-లక్సెట్టిపేట రోడ్డు

భైంసా: నిర్మల్ జిల్లాకు బాసర-లక్సెట్టిపేట రహదారి జీవన రేఖగా ఉంది. తూర్పు, పశ్చిమ జిల్లాలను కలుపుతూ 175 కిలో మీటర్ల మేర ఈ రహదారి వ్యాపించి ఉంది. రెండు జిల్లాలను కలిపే ఏకైక వారధి ఈ మార్గం అధికశాతం నిర్మల్ జిల్లాలోనే ఉంది. నిర్మల్ జిల్లాలో 125 కిలోమీటర్ల మేర విస్తరించి 13 మండలాల మీదుగా సాగి జిల్లాకు ప్రధాన రవాణా మార్గంగా ఉపయోగపడుతోంది. ఈ రహదారి పొడవునా పరిసర ప్రాంతాల గొప్పతనం, చారిత్రక అంశాలెన్నో కనిపిస్తుంటాయి.

నది నుంచి అడవి వరకు..

బాసర వద్ద గోదావరి నది ఒడ్డు నుంచి ప్రారంభమయ్యే ఈ రహదారి అడవుల గుండా లక్సెట్టిపేట వరకు విస్తరించి ఉంది. బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని చూస్తూ చదువుల తల్లి ఆశీస్సులు పొంది ఎంతోమంది ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. పక్కనే బిద్రెల్లి వద్ద మహారాష్ట్రలోకి ఓ మార్గం వెళ్తుంది. ఈ మార్గం గుండా భైంసా వరకు రెండు వైపులా వానాకాలంలో పత్తి చేల అందాలు చూడవచ్చు. వేసవిలో విస్తరించిన భూములు కనిపిస్తుంటాయి. భైంసా వద్ద మహారాష్ట్రకు వెళ్లే మరో జాతీయ రహదారి కనిపిస్తుంది. ఈ మార్గంలో పత్తి, సోయా పంటల లోడ్‌తో వెళ్లే వాహనాలు అధికంగా కనిపిస్తుంటాయి. మహారాష్ట్ర, గుజరాత్ వైపు వెళ్లే వాహనాలన్నీ ఈ మార్గం మీదుగా వస్తుంటాయి.

13 మండలాల మీదుగా..

నిర్మల్ జిల్లాలో ప్రత్యక్షంగా ఎనిమిది మండలాలు, పరోక్షంగా 13 మండలాల గుండా ఈ మార్గం ముందుకు వెళ్తుంది. నిర్మల్ జిల్లా అంతటిని కలిపే ఈ మార్గం విస్తరణపై అధికారులు దృష్టి సారించడం లేదు. జిల్లాలో పెద్దదైన ఈ మార్గాన్ని మరింత అభివృద్ధి చేయాలి. తూర్పు, పశ్చిమ జిల్లాలను కలిపే ఈ మార్గంలో అడుగడుగునా ఉన్న పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలను తెలిపే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఏళ్లుగా ఉన్న బాసర-లక్సెట్టిపేట మార్గంపై దృష్టిసారించాలని తూర్పు, పశ్చిమ జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రాలను కలుపుతూ..

బాసర వద్ద సరస్వతీ అమ్మవారి ఆలయం నుంచి కుంటాల మండలం కల్లూరులో సాయిబాబా ఆలయం, కాల్వ వద్ద నరసింహస్వామి, కదిలి పాపహరేశ్వరస్వామి ఆలయాలకు ఈ మార్గం గుండా వెళ్లవచ్చు. అక్కడి నుంచి నిర్మల్ చారిత్రక కోటలను దాటుకుంటూ గొలుసుకట్టు చెరువులను చూస్తూ జిల్లా కేంద్రాన్ని ఈ మార్గం కలుపుతుంది. నిర్మల్ జిల్లా ధాన్యాగారంగా పిలువబడుతున్న లక్ష్మణచాందతోపాటు మామడ, ఖానాపూర్ మండలాల మీదుగా ఈ మార్గంవెళ్తుంది. మామడ మండలంలోకి వెళ్లగానే దారి మధ్యలో ఏపుగా పెరిగిన టేకు చెట్లు, దట్టమైన అరణ్యం కనిపిస్తుంటుంది. జిల్లాలో చివరగా ఖానాపూర్‌లో గిరిజనుల ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, సదర్‌మాట్ గలగలలు వినిపిస్తూ కడెం నదికి పక్కనే ఈ మార్గం జన్నారం వైపు వెళ్తుంది. దస్తురాబాద్ నుంచి అభయారణ్యంలో నల్లతాచులా మెలికలు తిరిగి కవ్వాల్ అభయారణ్యంవైపు వెళ్తుంది. ఈ మార్గం పక్కనే కవ్వాల్ అభయారణ్యంలో లేడి పిల్లల పరుగులు, నీలుగాయిల ఉరుకులు, కుందేళ్ల కోలాహలం, పక్షుల కిలకిలలు చూసి మురిసిపోవాల్సిందే.

'అందరికీ వేదం అందిస్తాం'



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

బాసర: శ్రీవేద భారతి విద్యాపీఠానికి అనుబంధంగా నిర్వహిస్తున్న బాసర శ్రీవేదభారతి వేదవిద్యాలయం నిర్వహణకు వివిధ కుల సంఘాలతో కమిటీ ఏర్పాటు కాగా, అందులోని సభ్యులు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బాసరలో వేద విద్యాలయాన్ని నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. పూర్తి భద్రత ప్రమాణాలతో పాటు వచ్చే విద్యాసంవత్సరంలో నూతన ప్రవేశాలతో వేదవిద్యాలయాన్ని పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇటీవల విద్యార్థులు లోహిత్, మణికంఠ ప్రమాదాల్లోమృతి చెందగా బాసర పోలీసులు చట్టప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కొందరు దర్యాప్తుపై అనుమానాలు వ్యక్తం చేస్తూ హిందూ సమాజాన్ని తప్పుదోవ పట్టించేలా యత్నిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి నిందితులను పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రమాద ఘటనలపై కొన్ని మాధ్యమాలు అసత్య వార్తలు ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. వేద పాఠశాల ఆధ్వర్యంలో దక్షిణ భారతదేశంలోనే ఎనిమిదేళ్లుగా వైభవంగా కొనసాగించిన దక్షిణ గంగా గోదావరి హారతి ఇక నుంచి బాసర శ్రీవేద భారతి పీఠం, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడానికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీవేద విద్యాలయ సంచలన సమితి బాసర అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ మంథని, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్, సహ కార్యదర్శి జాదవ్ రాజేశ్‌బాబు, సంజీవరావు, లక్ష్మణ్‌రావు, సతీశ్‌రావు, గాడేకర్ రమేశ్, తుమ్ దత్తు, బిదూర్ రమేశ్, పురోస్తు గోపాలకృష్ణ తదితరులున్నారు.

కార్మికులకు మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న మధుకుమార్

బెల్లంపల్లి: సింగరేణి కార్మికులు, కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి కృషి చేస్తున్నట్లు బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి డెప్యూటీ సీఎంవో డాక్టర్ ఎం.మధుకుమార్ తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆస్పత్రికి కావాల్సిన వివిధ పరికరాలు తెప్పించనున్నట్లు పేర్కొన్నారు. సీఎంవోగా కిరణ్ రాజ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించాక బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రికి వారంలో రెండురోజులపాటు ఇతర ప్రాంతాల నుంచి ఆరుగురు స్పెషలిస్టులు వచ్చి రోగులకు చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. వీరి సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏరియా ఆస్పత్రికి కొత్తగా మరో నలుగురు వైద్యులను నియమించినట్లు తెలిపారు. గతం కన్నా ఏరియా ఆస్పత్రికి వచ్చే ఔట్‌పేషంట్లు, ఇన్‌పేషంట్ల సంఖ్య రెట్టింపైందని వివరించారు. మెరుగైన వైద్యం కోసం కంపెనీ గుర్తించిన ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నామని తెలిపారు. ఆస్పత్రికి సరిపడా సిబ్బందిని నియమించనున్నట్లు యాజమాన్యం తెలిపిందని పేర్కొన్నారు.

దొరికిపోతామని దొంగిలించారు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

వేమనపల్లి: వన్యప్రాణులను వేటాడేందుకు అడవికి వెళ్లిన వేటగాళ్లు పులుల ట్రాకింగ్ కోసం అమర్చిన సీసీ కెమెరాలకు చిక్కారు. ఇది గమనించిన వారు అధికారులకు దొరికిపోకూడదని ఏకంగా సీసీ కెమెరాలనే చోరీ చేశారు. చివరికి పోలీసులకు దొరికిపోయారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. నీల్వాయి అటవీ రేంజ్ పరిధిలో ఇటీవల అడపాదడప పులి సంచారం ఉంది. వివిధ రకాల వన్యప్రాణులున్నాయి. వీటి ట్రాకింగ్‌కు పలు ప్రాంతాల్లో నీల్వాయి అటవీ రేంజ్ సిబ్బంది మార్చిలో నాలుగు సీసీ కెమెరాలు అమర్చారు. మార్చి 25న అవి చోరీకి గురి కాగా నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు బొమ్మెన గ్రామానికి చెందిన కోల తిరుపతిని విచారించగా అదే గ్రామానికి చెందిన మానేపల్లి సమ్మయ్య, భట్టు కిష్టయ్య, మడె భీమయ్య అడవుల్లో బ్యాటరీ లైట్ సాయంతో వన్యప్రాణులను వేటాడుతున్నట్లు తెలిసింది. అందులో భాగంగా మార్చి 20న నలుగురు బ్యాటరీ లైట్ సాయంతో బద్దంపల్లి అటవీ ప్రాంతంలోకి వన్యప్రాణులను వేటాడేందుకు వెళ్లారు. ఈ క్రమంలో పులి ట్రాకింగ్ కోసం అమర్చిన సీసీ కెమెరాల ఫ్లాష్ లైట్‌లో పడ్డారు. దీంతో భయపడి అధికారులకు దొరికిపోతామనే భయంతో రెండు సీసీ కెమెరాలను తీసుకెళ్లారు. వాటిని కోల తిరుపతి ఇంట్లో దాచారు. ఆతర్వాత మైలారం అడవుల్లోకి మరోసారి వేట కోసం వెళ్లగా అదే రీతిలో సీసీ కెమెరాల ఫ్లాష్‌కు చిక్కారు. దీంతో అక్కడి రెండు సీసీ కెమెరాలు తొలగించి ధ్వంసం చేశారు. ఈ విషయమై అటవీ అధికారులు నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న ఎస్సై శ్యాంపటేల్ దర్యాప్తు చేపట్టారు. నిందితుల నుంచి బ్యాటరీ లైట్, నాలుగు సీసీ కెమెరాలు స్వాధీనం చేసుకున్నారు. చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై శ్యాంపటేల్ ఉన్నారు.

విందు సరే.. విధుల మాటేంటి?

- ఖాళీగా ఆదిలాబాద్ బల్దియా ఇంజినీరింగ్ విభాగం



ఖాళీగా ఇంజినీరింగ్ విభాగం

కైలాస్‌నగర్: ఎన్ని విమర్శలు ఎదుర్కొంటున్నా కొందరు ఆదిలాబాద్ బల్దియా అధికారులు, ఉద్యోగుల తీరు మారడం లేదు. ఇటీవల సెలవు పెట్టకుండా రెవెన్యూ ఉద్యోగులు మూకుమ్మడిగా కేరళకు విహారయాత్రపై వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన వారు అవస్థలు పడ్డారు. తాజాగా శుక్రవారం బల్దియా ఇంజినీరింగ్ విభాగంలో ఉద్యోగులు కనిపించకుండా పోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎవరూ విధులకు హాజరు కాకపోవడంతో తలుపులు మూసే ఉన్నాయి. ఈ విభాగానికి సంబంధించిన అధికారులు, ఉద్యోగులు ఎక్కడికి వెళ్లారని శాఖ ఉద్యోగులను పలువురు అడగగా లాండసాంగ్విలో విందు చేసుకుంటున్నట్లు చెప్పుకొచ్చారు. విధులు నిర్వహించే సమయంలో విందులో పాల్గొనడం ఏమిటని పలువురు ప్రశ్నించారు. అడిగేవారు లేక వారు ఆడిందే ఆటా.. పాడిందే పాటగా సాగుతోందని విమర్శలు గుప్పించారు. విందు చేసుకోవడం తప్పు కాదు గాని.. కార్యాలయ పనివేళల్లో మూకుమ్మడిగా వెళ్లడం ఏమిటని.. ఆయా పనుల కోసం కార్యాలయానికి వచ్చినవారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్‌లో అధికారుల పర్యవేక్షణ గాడితప్పిందని, ప్రత్యేకాధికారి నియామకమైన నుంచి ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం, ఉన్న అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఈ తతంగం సాగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఉద్యోగులు ప్రతీరోజు సమయపాలన పాటించడం లేదని చెబుతున్నారు. అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజును సంప్రదించగా.. లాండసాంగ్వి పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన దావత్‌కు వెళ్లారని పేర్కొనడం గమనార్హం.

జ్వరంతో బాలుడి మృతి

- సొంత ఇల్లు లేక రోడ్డుపైనే మృతదేహంతో రోదించిన తల్లి



రోడ్డుపై కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న సుప్రియ

లక్ష్మణచాంద: జ్వరంతో మృతి చెందిన కొడుకు అంత్యక్రియలు నిర్వహించలేని దుస్థితిలో ఓ తల్లి పడిన వేదన వర్ణనాతీతం. వివరాలు.. నిజామాబాద్‌కు చెందిన చింతకింది లక్ష్మణ్-సుప్రియ దంపతులు మూడేళ్ల కిందట బతుకుదెరువు కోసం లక్ష్మణచాందకు వచ్చారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడున్నారు. గతేడాది ఇద్దరి మధ్య గొడవ జరగగా లక్ష్మణ్ భార్య, పిల్లలను వదిలి నిజామాబాద్‌కు వెళ్లాడు. దీంతో సుప్రియ పిల్లలతో కలిసి లక్ష్మణచాందలోనే ఉంటోంది. కూలీకి వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. నాలుగు రోజుల క్రితం కుమారుడు లక్ష్మీకాంత్ (12)కు జ్వరం రాగా అతడిని మొదట నిర్మల్ ఆస్పత్రిలో చూపించింది. ఆ తర్వాత హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. సుప్రియ పుట్టెడు దుఃఖంతో శుక్రవారం ఉదయం కొడుకు మృతదేహంతో లక్ష్మణచాందకు వచ్చింది. సుప్రియ ఉంటున్నది అద్దె ఇల్లు కావడంతో రోడ్డుపైనే మృతదేహాన్ని ఉంచి కన్నీరుమున్నీరుగా విలపించింది. తనకు ఎవరూ లేక దిక్కుతోచని పరిస్థితిలో దుఃఖించింది. గ్రామస్తులే మరో ఇంటి ఎదుట టెంట్ వేసి మృతదేహాన్ని అక్కడికి తరలించారు. చేతిలో చిల్లిగవ్వ లేని సుప్రియ కుమారుడి అంత్యక్రియలు కూడా చేయలేని పరిస్థితిలో ఉండగా గ్రామస్తులు కొంతమొత్తాన్ని సేకరించి సుప్రియకు అందించారు. చివరకు పోలీసులు అక్కడికి చేరుకుని సుప్రియ భర్త లక్ష్మణ్‌కు సమాచారం ఇచ్చారు. లక్ష్మణ్ బంధువులతో లక్ష్మణచాందకు వచ్చి కుమారుడి మృతదేహాన్ని తీసుకుని నిజామాబాద్‌కు తీసుకువెళ్లాడు.

బీసీ జెండా ఎగురవేస్తాం

- బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సంజయ్‌కుమార్



బోథ్‌లో మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

బోథ్: ప్రతీ పల్లెలో బీసీ జెండా ఎగురవేస్తామని బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'బీసీ మేలు కొలుపు రథ యాత్ర' శుక్రవారం బోథ్‌కు చేరింది. ఈ సందర్భంగా బోథ్‌లో బీసీ కులాల నాయకులతో కలిసి అంబేడ్కర్, కొమురంభీం, శివాజీ, కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించినట్లు 42 శాతం రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని కోరారు. దేశ వ్యాప్తంగా కులగణన ప్రక్రియ శాస్త్రీయ పద్ధతిలో వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు సరైన అవకాశాలు లేక అన్ని రంగాల్లో వెనుకబడి అణగారిన వర్గాలుగా, పేదవారుగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ అడ్‌హక్ కమిటీని నియమించారు. సభ్యులుగా జక్కుల వెంకటేశ్, మల్లెపూల శివారెడ్డి, కొండ స్వామి, గంగుల మల్లేశ్, కరిపె శ్రీనివాస్, ఇప్ప శ్రీనివాస్, తడక పోశెట్టి, ఏరుగట్ల రాజును నియమించారు. రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, బీసీ ఆజాది ఫెడరేషన్ నాయకులు మాచర్ల శ్రీనివాస్, నామాని అర్జున్, స్థానిక కుల సంఘాల నాయకులు బీ గోవర్ధన్, ఈ శ్రీనివాస్, కర్ల శ్రీనివాస్, ఆళ్ల పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

జొన్నలు తరలిస్తున్న వాహనాల పట్టివేత



పట్టుబడిన వాహనాలతో సీఐ, ఏవో

తాంసి: మహారాష్ట్ర నుంచి అక్రమంగా జొన్నలను వాహనాల్లో తరలించి శుక్రవారం తాంసి మార్కెట్ యార్డులో విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు జైనథ్ సీఐ డీ సాయినాథ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొద్దిరోజులుగా తెలంగాణ మార్కెట్‌లో జొన్నలకు అధిక ధర లభిస్తుండగా మహారాష్ట్రకు చెందిన దళారులు తెలంగాణ రైతుల పట్టాపాస్‌పుస్తకాల పేరిట జిల్లాలోని వివిధ మార్కెట్‌యార్డుల్లో జొన్నలు విక్రయిస్తున్నారు. దీనిపై పక్కా సమాచారం మేరకు సీఐ శుక్రవారం భీంపూర్ ఎస్సైతో కలిసి భీంపూర్ మండలం నిపాని వద్ద తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర నుంచి జొన్నలతో వస్తున్న ట్రాక్టర్, రెండు బొలెరో వాహనాలను పట్టుకున్నారు. మహారాష్ట్రలోని ఘంటాజీ, జరూర్ నుంచి అక్రమంగా జొన్నలు తరలిస్తున్నట్లు గుర్తించారు. మూడు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఏవో శ్రీనివాస్‌రెడ్డి, ఏఈవో సాయిప్రసాద్ సమక్షంలో సీజ్ చేసి మహారాష్ట్రకు చెందిన సుశాంత్, దినేశ్, సునీల్, భారత్, గోకుల్‌తోపాటు మార్కెట్‌లో జొన్నల విక్రయానికి పట్టాపాస్ పుస్తకాలు ఇచ్చి సహకరిస్తున్న భీంపూర్ రైతులు నారాయణ, రాథోడ్ అరవింద్, వామన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్సై పీర్‌సింగ్ నాయక్, సిబ్బంది దినేశ్ ఉన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య



గులాబ్‌రావు (ఫైల్)

తానూరు: మండలంలోని దాగాం గ్రామానికి చెందిన గాడేకర్ గులాబ్‌రావు (40) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గులాబ్‌రావు కొన్నేళ్లుగా మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా ఇంటివద్దే ఉంటున్నాడు. మద్యం అలవాటు మానుకోవాలని పలుసార్లు కుటుంబ సభ్యులు చెప్పినా పట్టించుకోలేదు. గురువారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య శాంతాబాయి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జీవితంపై విరక్తితో వృద్ధురాలి బలవన్మరణం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని కచికంటి గ్రామానికి చెందిన కాసరపు భూలక్ష్మి (65) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. భూలక్ష్మి ఎనిమిది నెలల క్రితం పశువుల దాడిలో తీవ్రంగా గాయపడ్డది. కుటుంబ సభ్యులు ఆమెకు చికిత్స చేయించినా ఆమె మంచానికే పరిమితమైంది. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. మృతురాలి కుమారుడు నర్సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో జారిపడి రైతు మృతి



గంగాధర్ (ఫైల్)

సర్సాపూర్(జి): ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి రైతు మృతి చెందాడు. ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తురాటి గ్రామానికి చెందిన రైతు ముక్కెర గంగాధర్ అలియాస్ గంగారెడ్డి (41) తన కొడుకు రిన్నుతో కలిసి ఎద్దులను కడగడానికి శుక్రవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని ఊర చెరువుకు వెళ్లాడు. చెరువులోకి దిగిన గంగాధర్ ప్రమాదవశాత్తు అందులో జారిపడి ఈతరాక నీటమునిగి మరణించాడు. గజ ఈతగాళ్ల సాయంతో చెరువులో వెతకగా అతడి మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. చెరువులో అక్రమంగా జేసీబీలతో పెద్దపెద్ద గుంతలు తీయడంతోనే ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చెక్‌డ్యాంలో పడి మతిస్థిమితం లేని మహిళ మృతి

సారంగపూర్: మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మహిళ చాట్ల లక్ష్మి శుక్రవారం చెక్‌డ్యామ్‌లో పడి మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంజర్ గ్రామానికి చెందిన లక్ష్మి చిన్నప్పటి నుంచే మతిస్థిమితం లేక గ్రామంలో తిరుగుతుండేది. ఆమెకు కుటుంబ సభ్యులు, బంధువులెవరూ లేరు. గ్రామస్తులు అందించే భోజనం తింటూ ఉండేది. మూడు రోజులుగా ఆమె కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు గాలింపు చేపట్టారు. గ్రామ సమీపంలోని చెక్‌డ్యామ్ వద్ద ఆమె మృతదేహం కనిపించగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై శ్రీకాంత్ ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో కిందపడ్డ ఒకరికి గాయాలు

బెల్లంపల్లి: అతిగా మద్యం సేవించి కింద పడిపోయిన ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన మోహన్ దుర్వే బెల్లంపల్లికి వచ్చాడు. పాత బస్టాండ్ వైన్‌షాపు వద్ద అతిగా మద్యం సేవించాడు. కాసేపటికే మద్యం మత్తులో కింద పడగా తలకు తీవ్ర గాయమై రక్తస్రావమైంది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య వెంటనే మోహన్ దుర్వేను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు రెఫర్ చేశారు.

అడవిపంది దాడిలో ఒకరి మృతి

ఇంద్రవెల్లి: అడవిపంది దాడిలో ఒకరు మృతి చెందారు. ఎస్సై సాయన్న, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దొడందా పంచాయతీ పరిధి చిలటిగూడ గ్రామానికి చెందిన మడావి బొజ్జు (58) అదే గ్రామానికి చెందిన పుసం నాందేవ్, మడావి మంతులు శుక్రవారం మేకలను మేత కోసం అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లారు. మేకలు మేస్తుండగా చెట్టు కింద కూర్చుని ఉన్న బొజ్జుపై అకస్మాత్తుగా అడవిపంది దాడి చేసింది. కడుపు, ఛాతి భాగంలో తీవ్రంగా గాయపరచగా బొజ్జు అక్కడికక్కడే మృతి చెందాడు. పుసం నాందేవ్, మడావి మంతులు చెట్టు ఎక్కి ప్రాణాలు దక్కించుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువతిని వేధించిన యువకుడిపై కేసు

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఓ యువతిని స్నాప్ చాట్ యాప్‌లో వేధించిన సాయి అనే యువకుడిపై ఎస్సై ప్రవీణ్‌కుమార్ శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన సాయి స్నాప్‌చాట్ యాప్‌లో ఫేక్ ఐడీని క్రియేట్ చేసి బోథ్ మండల కేంద్రానికి చెందిన ఓ యువతిని వేధింపులకు గురి చేశాడు. దీంతో సదరు యువతి షీటీంకు సమాచారం ఇచ్చింది. షీటీం సభ్యులు శుక్రవారం సాయిని పట్టుకుని బోథ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మహిళలు, యువతులు ఎలాంటి వేధింపులకు గురైనా 8712659953 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రమాదవశాత్తు రాడ్ కట్టర్ తగిలి ఒకరి మృతి



చంద్రకాంత్ (ఫైల్)

జైనథ్: మండల కేంద్రానికి చెందిన కోకస్ చంద్రకాంత్ (40) రాడ్ కట్టర్ తగిలి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఓ ఇంటి వద్ద చంద్రకాంత్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు రాడ్ కట్టర్ ఎడమ చేయి వైపు పడింది. దీంతో అతడి చేతికి గాయమై తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి చంద్రకాంత్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా పెరాడి గ్రామానికి చెందిన కరాడే చంపత్ (27) రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసైన చంపత్ ఈనెల 7న తన గ్రామంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ తీగలు సరిచేశారు



స్తంభంపై తీగలు సరిచేస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ నుంచి బాబాపూర్ గ్రామ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన త్రీఫేజ్ విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. దీనిపై ఈనెల 6న వేలాడుతున్న తీగలను సరి చేయరూ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఏఈ మహేశ్ శుక్రవారం తన సిబ్బందితో కలిసి స్తంభాలు ఏర్పాటు చేయించి విద్యుత్ తీగలను సరిచేశారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

తానూరు: ఆలయాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామని ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు. మండలంలోని వడ్గాం గ్రామంలో ఇటీవల హనుమాన్ ఆలయం నిర్మించగా శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి, చిన్నారెడ్డి, చక్రధర్, శివాజీ పటేల్, సోమ్‌నాథ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కూలీలు ఉదయమే పనులకు వచ్చేలా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరమేశ్

లోకేశ్వరం: ఎండల నేపథ్యంలో కూలీలు ఉదయమే ఉపాధి పనులకు వచ్చేలా చూడాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం కింద రుణం కోసం దరఖాస్తు చేసుకున్న ఆన్‌లైన్ పత్రాలను కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు. సోలమాన్‌రాజ్, ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్ తదితరులు ఉన్నారు.

దడ్వాయి యూనియన్ కార్యవర్గం ఎన్నిక

భైంసాటౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ దడ్వాయి యూనియన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సంఘ భవనంలో నిర్వహించిన ఎన్నికలో అధ్యక్షుడిగా సతీష్, ఉపాధ్యక్షుడిగా రామారావు, కోశాధికారిగా పోతన్న ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని యూనియన్ సభ్యులు శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

దస్తురాబాద్: విద్యార్థులను ప్రైవేటుకు కాకుండా సర్కారు బడులకే పంపించాలని ఎంఈవో గంగాధర్ అన్నారు. శుక్రవారం దస్తురాబాద్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో నైపుణ్యం కల్గిన ఉపాధ్యాయులు ఉంటారని.. మౌలిక వసతులు, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నామని.. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోట వేణు, ఉపాధ్యాయులు రవీందర్, కోటేశ్, తిరుపతి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లను అర్హులకే కేటాయించాలి

ఖానాపూర్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన నిరుపేదలనే ఎంపిక చేయాలని బహుజన కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకుడు పసుపుల వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. పలు చోట్ల ఇందిరమ్మ కమిటీ సభ్యులతోపాటు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తూతూ మంత్రంగా సర్వే చేయడంతో అర్హులైన పేదలు నష్టపోతున్నారని వాపోయారు. దీనిపై ఉన్నతాధికారులతోపాటు కలెక్టర్ దృష్టి సారించి సమగ్ర సర్వే ద్వారా అర్హులు ఎంపికయ్యేలా చూడాలని కోరారు. లేకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

వన్యప్రాణుల వ్యథ..



కడెం: ఎండాకాలంలో భానుడి ప్రతాపానికి మనుషులే అల్లాడిపోతుంటే.. ఇక వన్యప్రాణుల పరిస్థితి దయనీయంగా ఉంది. అడవుల్లో వాగులు, వంకలు ఎండిపోయి చుక్కనీరు దొరకని పరిస్థితి. వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు కడెం మండలం ఉడుంపూర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాసర్‌ఫీట్లలో సంబంధితశాఖ అధికారులు నీటిని నింపడం లేదు.

భగీరథ వృథా..



లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో రామాలయం వెనుక మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి కొద్దిరోజులుగా నీరంతా వృథాగా పోతోంది. అధికారులు స్పందించి లీకేజీని సరి చేసి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.





నాడు పచ్చదనం..నేడు కళావిహీనం

కడెం: పెరుగుతున్న ఎండలకు మండలంలోని దోస్త్‌నగర్ సమీపంలోని అటవీ ప్రాంతం కళావిహీనంగా మారింది. వానాకాలంలో ఈ రహదారి వెంట వచ్చిపోయేవారిని పచ్చదనం మంత్రముగ్ధుల్ని చేస్తోంది. కానీ నేడు ఈ ప్రాంతంలో ఆకులు రాల్చిన చెట్లే దర్శనమిస్తున్నాయి.

కొలువుల భర్తీపై ఆశలు

- ఎస్సీ వర్గీకరణతో మార్గం సుగమం
- ఖాళీల గుర్తింపు ప్రక్రియ షురూ
- పోటీ పరీక్షలకు నిరుద్యోగుల సన్నద్ధం
- జిల్లాలో గ్రంథాలయాలు కిటకిట..



జిల్లాకేంద్రంలోని గ్రంథాలయంలో చదువుతున్న నిరుద్యోగులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను పూర్తి చేసి, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ల జారీకి సిద్ధమవుతోంది. ఏప్రిల్ 14న రాష్ట్ర మంత్రి, ఎస్సీ వర్గీకరణ సబ్–కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించడంతో నిరుద్యోగ యువతలో ఆశలు చిగురిస్తున్నాయి. గెజిట్ నోటిఫికేషన్, జీవోల జారీతో ఉద్యోగ ఖాళీల గుర్తింపు ప్రక్రియ వేగవంతమైంది. ఈ నెలాఖరు నాటికి శాఖలవారీగా ఖాళీలను ఖరారు చేసి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు.

నిరుద్యోగుల సన్నాహాలు..

నిర్మల్ జిల్లా యువత జిల్లా, జోనల్, మల్టీ–జోనల్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతోంది. ఉపాధ్యాయ, గురుకుల, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖల్లోని పోస్టుల కోసం గ్రంథాలయాలు, కోచింగ్ సెంటర్లలో చదువుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయం, కావేరి ఫౌండేషన్ గ్రంథాలయాలు నిరుద్యోగులతో కిటకిటలాడుతున్నాయి. భైంసా, ఖానాపూర్ పట్టణాల్లోని గ్రంథాలయాలు కూడా రద్దీగా ఉన్నాయి. కొందరు స్నేహితులతో కలిసి అద్దె గదుల్లో చదువుకుంటున్నారు.

పెరిగిన నిరుద్యోగుల సంఖ్య..

నిర్మల్ జిల్లాలో నిరుద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన 8,500 మంది, డిగ్రీ, బీటెక్ అర్హత కలిగిన 10 వేల మంది ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఉపాధ్యాయ, కానిస్టేబుల్, గ్రూప్–4 పోస్టులకు పోటీ తీవ్రంగా ఉంటుంది. బాసర జోనల్ స్థాయిలో నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల యువత పోటీపడనుంది.

జీపీవో, ఇతర ఉద్యోగాలపై ఆశలు..

రాష్ట్రవ్యాప్తంగా 4 వేలకుపైగా జీపీవో(గ్రామ పాలన అధికారి) పోస్టులతోపాటు 10 వేల కానిస్టేబుల్, 1,500 ఎస్సై, అసిస్టెంట్ ప్రొఫెసర్, వైద్య, పారామెడికల్, అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మన జిల్లాలోనూ గణనీయమైన ఖాళీలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలి



ఈసారి ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న దృఢ సంకల్పంతో సన్నద్ధమవుతున్నా.. ప్రస్తుతం చేస్తున్న చిన్నాచితక ప్రైవేటు ఉద్యోగాలను మానుకొని పుస్తకాలతో కుస్తీ పడుతున్నాం. కాలయాపన చేయకుండా జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేసి నియామక ప్రక్రియను పూర్తిచేయాలి.

– గోస్కుల రాజమహేందర్, ఖానాపూర్

ఈసారి ఉద్యోగం సాధిస్తా...



గతేడాది డీఎస్సీలో టీచర్ ఉద్యోగాన్ని తృటిలో మిస్సయ్యాను. చిన్నచిన్న తప్పిదాలతో స్వల్ప మార్కుల తేడాతో ప్రభుత్వ ఉద్యోగం కోల్పోయాను. పట్టు సడలించకుండా ఈసారి ఉద్యోగం సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా చదువుతున్నా. కచ్చితంగా రానున్న నోటిఫికేషన్ ద్వారా లక్ష్యాన్ని చేరుకుంటాను.

– టి.సునీల్, బీరవెల్లి, మం.సారంగపూర్

సర్కారు బడుల్లోనే చదివించాలి



పార్‌పెల్లిలో మాట్లాడుతున్న హెచ్‌ఎం మోహన్



ఎల్విలో మాట్లాడుతున్న ఎంఈవో నరేందర్

లక్ష్మణచాంద: అన్ని సౌకర్యాలున్న ప్రభుత్వ బడుల్లోనే తమ పిల్లలను చదివించాలని మండలంలోని పార్‌పెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆడె మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పార్‌పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోషకులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం తల్లిదండ్రుల వద్దకు వెళ్లి తమ విద్యార్థుల ప్రతిభను వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, రెండు జతల దుస్తులు, నోట్ బుక్స్, మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని వివరించారు. ఇందులో పలువురు ఉపాధ్యాయులు గంగసురేశ్, ఆదిల్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

పోషకులతో సమావేశం

తానూరు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ఉపాధ్యాయులు.. విద్యార్థుల పోషకులతో సమావేశం నిర్వహించారు. ఎల్వి గ్రామంలో ఎంఈవో నరేందర్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఇంటివద్ద విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించాలన్నారు. ఫోన్‌కు దూరం ఉంచి మైదానంలో ఆటలు ఆడేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, మాధవ్‌రావ్ సుదర్శన్, సీఆర్పీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు రక్షణ కల్పించండి



డీటీ యాదవరావ్‌కు వినతిపత్రం ఇస్తున్న మత్స్యకారులు

దస్తురాబాద్: గోదావరిలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు రక్షణ కల్పించాలని కోరుతూ శుక్రవారం దస్తురాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో, పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దస్తురాబాద్‌కు చెందిన మత్స్యకారులకు, మండలంలోని భూత్కూర్ పంచాయతీలోని రాంపూర్ గ్రామ మత్స్యకారులకు 2017లో గొడవలు జరగడంతో గోదావరిలో చేపల వేట నిలిపివేసినట్లు పేర్కొన్నారు. మళ్లీ చేపల వేటకు సిద్ధమవుతున్నారని.. రక్షణ కల్పించాలని వినతిపత్రంలో కోరారు. డీటీ యాదవరావ్, మత్స్యకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుకు ముందుకురావాలి



అవగాహన కల్పిస్తున్న అధికారి

దస్తురాబాద్: రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలని ఏఈవో తిరుపతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని భూత్కూర్ గ్రామంలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ పరికరాలను ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. ఆసక్తి కల్గిన రైతులు మండలకేంద్రంలోని రైతువేదికలో సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో ఫ్రీ యూనిక్ కంపెని మండల క్లస్టర్ అధికారి నవీన్ తదితరులు ఉన్నారు.

తక్కువ ధరకు విక్రయించొద్దు



గొల్లమాడలో కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో శుక్రవారం కౌట్ల(బి) పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తక్కువ ధరకు దళారులకు విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు కోర్వ రాజేందర్, సాయన్న, మహేందర్, బోసాని భోజన్న ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. రైతులు కొనుగోలు కేందంలోనే పంటను విక్రయించి మద్దతుధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో పాపెన్ రాజేశ్వర్, నాకిడి నవీన్, చెన్న మహేశ్, సెంటర్ నిర్వాహకుడు గోసుకల భూమయ్య పాల్గొన్నారు.

బస్సు అడ్డుకుంటున్నారని ఆందోళన



మల్లాపూర్‌లో ఇరు గ్రామాల ప్రజలను సముదాయిస్తున్న పోలీసులు

లక్ష్మణచాంద: మల్లాపూర్‌కు చెందిన ఓ కుటుంబం తమ గ్రామానికి ఆర్టీసీ బస్సును రాకుండా అడ్డుకుంటున్నారని..మాచాపూర్ గ్రామస్తులు ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళితే.. మల్లాపూర్ పంచాయతీ పరిధిలో మచాపూర్ గ్రామం ఉంది. శుక్రవారం మల్లాపూర్‌లో బండరాళ్లను అడ్డు పెట్టి ఓ కుటుంబం ఆర్టీసీ సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నారని తెలియడంతో మాచాపూర్ గ్రామస్తులంతా మల్లాపూర్‌కు తరలివచ్చారు. సదరు కుటుంబంతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు వచ్చి ఇరుపక్షాలను సముదాయించి ఆర్టీసీ బస్సు రాకపోకలను పునరుద్ధరించారు. సమస్య ఉంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పరిష్కరించుకోవాలని.. పోలీసులు ఇరు గ్రామాల ప్రజలకు సూచించారు.

ఏపీ పోలీసుల దాడి హేయమైన చర్య



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

కుంటాల: సెర్చ్ వారెంట్ లేకుండా సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంటిపై ఏపీ పోలీసుల దాడి హేయమైన చర్య అని టీయూడబ్ల్యూ(ఐజేయూ) జిల్లా కార్యవర్గ సభ్యుడు, మండల కన్వీనర్ బోయిన్ పల్లి రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కుంటాలలో జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి తహసీల్దార్ కార్యాలయంలో భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దాడిని ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేసినట్లుగా వర్ణించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు దాసరి రాజు, బోనగిరి రవికుమార్, గుమ్ముల దినేశ్, నవీన్ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ



ముధోల్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

ముధోల్: మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడొద్దని ఇన్‌చార్జి ఎస్సై సంజీవ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని విఠోలి రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. చోదకులు బీమా, డ్రైవింగ్ లైసెన్సు కల్గి ఉండాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సాపూర్(జి): మండలంలోని గుండంపల్లి ఎక్స్‌రోడ్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఐదు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ డి.శంకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాంపూర్, దర్యాపూర్, చర్లపల్లి, నసీరాబాద్, టెంబుర్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భైంసాలో సాయంత్రం..

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో నిర్మల్‌రోడ్, పులేనగర్, రాహుల్‌నగర్, ఓవైసీ నగర్, రాజీవ్‌నగర్, మోమినామ్ గల్లి, ఏక్‌మినార్ ఏరియా, పిప్రికాలనీ, పల్సి ఫీడర్, స్పిన్నింగ్ మిల్ ఫీడర్, తిమ్మాపూర్ ఫీడర్ ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఖానాపూర్: మండలంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నెలవారీ మరమ్మతులో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంసింగ్ తెలిపారు. మండలంలోని సుర్జాపూర్, సత్తనపల్లి, ఖానాపూర్, బీర్నంది, పాతఎల్లాపూర్‌తోపాటు కడెం మండలంలోని లింగాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. ప్రజలు గమనించాలని కోరారు.

భారత సైనికులకు మద్దతుగా పూజలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

లక్ష్మణచాంద: పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో భారత సైనికులు విజయం సాధించాలని శుక్రవారం లక్ష్మణచాందలోని మాత ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జై జవాన్ అంటూ నినాదాలు చేశారు.

ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

కుంటాల: కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని తహసీల్దార్ కమల్‌సింగ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భూభారతి చట్టం అమలులో భాగంగా భూసమస్యలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు కుంటాల మండలం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైంది. ఇప్పటికే మండలంలోని ఆయా గ్రామాల్లో ఈనెల 12 వరకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోనివారు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

ఆలయ వార్షికోత్సవం ప్రారంభం

ఖానాపూర్: పట్టణంలోని జేకే నగర్ కాలనీలో ఉన్న అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా మహా గణపతిపూజ, గౌరీ పూజ, పుణ్యాహవచనం, శ్రీలలిత పరమేశ్వరి సహిత అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకం, అర్చన చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను రథంలో ఉంచి పుర వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

తీరిన గన్నీసంచుల కొరత



బస్తాలను తరలిస్తున్న హమాలీలు

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేట వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో గన్నీసంచుల కొరత తీర్చి.. పంటను తూకం వేసి మిల్లులకు తరలించామని డిప్యూటీ తహసీల్దార్ యాదవరావ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రేవోజీపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కేంద్రంలో 10వేల గన్నీసంచులు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు, నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: కలెక్టర్ అభిలాష అభినవ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం క్యాంపు కార్యాలయంలో శుభాకాంక్షల సందడి నెలకొంది. ఈసందర్భంగా పలువురు జిల్లా అధికారులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వివిధ శాఖల అధికారులు గోవింద్, జీవరత్నం, శ్రీనివాస్, విజయలక్ష్మి, నరసింహారెడ్డి, అశోక్, శంకరయ్య, రామ్‌గోపాల్, విష్ణువర్ధన్, ఖాలిక్ అహ్మద్, రాజేందర్, సుభాశ్ ఉన్నారు.